కోర్టులో పులిలా గర్జించే ప్లీడరుగారు డాక్టరుగారి దగ్గర పిల్లి అయిపొయ్యారు.

''ఆపరేషను తప్పదంటారా?'' అని దీనంగా అడిగారు.

''తప్పదు, తప్పదు, తప్పదు, తర్వాత మీ ఇష్టం'' అని డాక్టరుగారి సమాధానం.

గర్భసంచి తీసెయ్యకపోతే ప్లీడరుగారి భార్యకు క్యాన్సరు రావచ్చునట.

ఇప్పుడు రెండు వేల రూపాయిలకు వెనకాడితే, క్యాన్సరు వస్తే, తగ్గటం మాట అటుంచి ఖర్చు ఎంతవుతుందో తెలుసా?'' డాక్టరుగారు తురుపుముక్క వేశారు.




ఖర్చు ఎంతయ్యేది ముందుగానే చూచాయగా హెచ్చరించారు.

ఒక BAIL కేసులో సంపాదించింది డాక్టరుగారికి అర్పించుకోవడానికి తయారయ్యి, మరుసటి రోజే శ్రీమతిని నర్సింగ్ హోమ్‌లో చేర్చారు ప్లీడరు గారు.

కేసులను వాదించడంలో ప్లీడరుగార్కి ఎంత పేరుందో, ఆపరేషన్లుచేయడంలో డాక్టరుగార్కి అంత పేరుంది. ఇద్దరి ఫీజు అందరికన్నా ఎక్కువే. అయితే ఒక తేడా వుంది. డాక్టరు గారు చదువు మీద చాల ఖర్చు పెట్టవల్సి వచ్చింది. మెడికల్ కాలేజీలో సీటుకు డొనేషను అందులో ఒక భాగమే.

** ** **

ఆ రోజుకు ఆపరేషన్లు ముగించుకొని కారులో ఇంటికి బయలు దేరబొయ్యారు డాక్టరుగారు. ఎంత ప్రయత్నించినా కారు కదలనని మొరాయించింది. పేషంట్ల చుట్టాల్ని, స్టాఫ్‌ను పిలిచి కారు తోయించుకొని బయలు దేరి, నేరుగా గ్యారేజికి వెళ్ళారు డాక్టరుగారు.

గ్యారేజీ ఓనరుగారే స్వయంగా కారుని పరీక్షించారు. ఒకరెండు తిరిగి కూడా వచ్చారు.

''డాక్టరుగారూ! ఈ కారులో ఎట్లా తిరుగుతున్నారు?''

''ఇతరుల ఆరోగ్యం తప్ప, మీ కారు ఆరోగ్యం మీకు పట్టినట్లు లేదే?''

అది సరిగా లేదని, ఇది సరిగా లేదని ఓ పెద్ద లిస్టు చెప్పేశారు గ్యారేజి ఓనరుగారు. ''కారు వదిలి పొండి, నాల్రోజుల్లో బాగుచేయించి పంపిస్తా.''

డాక్టరుగారు ఏమీ మాట్లాడకపోవడం గమనించి, ''ప్రాణంతో చెలగాటం వద్దు, మూడు వేలు ఖర్చు పెట్టే కొత్తకారులాగ అవుతుంది'' అన్నారు గ్యారేజి ఓనరుగారు.

''సరే, కానివ్వండి'' అని కారు వదిలేసి రిక్షాలో పొయ్యారు డాక్టరుగారు.

గ్యారేజి ఓనరుగారి కోడలికి సిజేరియను ఆపరేషను చేసి నెల రోజులు కాలేదు. ఆయన దగ్గర సంపాదించింది తిరిగి ఆయనకే ఇచ్చుకోక తప్పదం లేదనుకొన్నారు డాక్టరుగారు.

** ** **

సిజేరియన్ అయితేమాత్రం ఏం? బంగారం లాంటి మనవడు పుట్టాడని సంతోషించారు గ్యారేజి ఓనరుగారు. తాత అవుతామనుకొన్న కలలు ఇప్పటికి ఫలించాయి. మనవడికి మంచి బంగారపు గొలుసు చేయిద్దామని సేఠ్‌జీ దగ్గరకి వెళ్ళారు గ్యారేజి ఓనరుగారు.

కుశలప్రశ్నలయింతర్వాత సేఠ్‌జీ అడిగారు, ''భాయ్! ప్రపంచంలో అన్నిటికన్నా మంచి కార్లు ఏ దేశంలో తయారవుతాయి?''

''జపాన్,'' తడుముకోకుండా సమాధానం చెప్పారు గ్యారేజి ఓనరుగారు.

''ఆ దేశం నుంచి నిన్ననే కొన్ని బిస్కట్లు వచ్చాయి. అందులోంచి మీ మనవడికి మంచి గొలుసు చేయిద్దాం?'' అన్నారు సేఠ్.

జపాను కార్లన్నా, రేడియో - టేప్ రికార్డర్లన్నా, గడియారాలన్నా అందరి లాగానే గ్యారేజి

ఓనరుగార్కి ఎంతో మక్కువ. జపాన్ బంగార మనేసరికి మారు మాట్లాడకుండా ఆర్డరిచ్చి వచ్చేశారు.

జపాన్ అస్త్రం సరిగ్గా పనిచేసినందుకు ఎంతో సంతోషించారు సేఠ్‌గారు, స్టూవర్టుపురం దొంగోడి దగ్గర సగం రేటుకు బంగారం కొని పది రోజులు కాలేదు. వెంటనే మంచి ఆర్డరు.

**　　**　　**

పోలీసు స్టేషను నుంచి కబురు రాగానే వణుకుతూనే బయలు దేరారు సేఠ్‌గారు.

"దొంగ బంగారం మర్యాదగా ఇచ్చేయి" గర్జించారు సబ్ ఇన్‌స్పెక్టరు (S.I.) గారు. బంగారం కొననివాళ్ళే పోలీసులకు భయపడి బంగారం ఇచ్చిన కేసులెన్నో, వాదించి ఉపయోగం లేదు. లేకపోతే కటకటాలు తప్పవు. పట్టుబడ్డ దొంగవాడు పోలీసు దెబ్బలకు తాళలేక అంతా చెప్పేస్తాడు. ఒక కేసులో దొరికితే పది కేసుల వివరాలు.

అయితే పేరున్న సేఠ్ గనుక, పది సవర్ల బంగారం కొన్నా అయిదు సవర్లే ఇచ్చి బయట పడ్డాడు. సగం ధరకు కొన్న బంగారంలో లాభం గూబలోకి పోయింది. చివరకు అసలు ధరకే కొన్నట్లయింది. అయితే, కొన్న బంగారం అంతా పోలీసులకు ఇవ్వడం లేదుగా! (ప్లీడరుగారు దొంగను బెయిలు మీద విడుదల చేయించారు.)

**　　**　　**

## క్రాంతి శిశువు

నా దీర్ఘ బాహువులు
కుల, మతాల, విష వృక్షాన్ని
నరికేసే - గండ్ర గొడ్డళ్ళు
నా - కనుచూపులు
అంటరానితనాన్ని
మాడ్చేసే - తీక్షణ జ్వాలలు
నా - మేధస్సు
పడమర నిదురించిన చైతన్యాన్ని
మేల్కొలిపి - తూర్పున ఉదయించే
క్రాంతి - శిశువు

...రామభోజ

సేఠ్ పోయిన కొద్ది నిమిషాలకు ఎం.ఎల్.ఏ. (M.L.A.) గారి దగ్గరి నుంచి ఫోను, హడావుడిగా బయలుదేరారు ఎస్.ఐ.గారు. తనని ఈ ఊళ్ళో పోస్టు చేశారంటే ఎం.ఎల్.ఏ. గారి పుణ్యమే. వారి అండలేకపోతే ఒక్కరోజు కూడా ఈ ఊళ్ళో వుండడం కష్టం.

"అమ్మాయి పెళ్ళి వచ్చేవారమే. బియ్యం ఏర్పాట్లు నువ్వు చూడాలి" అన్నారు ఎం.ఎల్.ఎ. గారు.

"సాయంత్రానికి పంపిస్తా సార్" అన్నారు ఎస్.ఐ.గారు.

రైసు మిల్లరుకు ఒక ఫోను చేయంగానే బియ్యం ఎం.ఎల్.ఏ. గారి ఇంటి ముందు వచ్చి దిగినయి. కారణం మిల్లరు గారి అబ్బాయి కేసు తేలకపోవడమే.

పార్టీకి వెళ్ళి, మందు కొట్టి, కారులో తిరిగి వస్తుంటే కారు క్రింద సైకిలుమీద వచ్చే ఒక కుర్రాడు పడ్డాడు. ఆ కుర్రాడ్ని దేవుని దయకు వదిలేసి ఇంటికి వచ్చేశాడు మిల్లరుగారి అబ్బాయి. కేసు ఇంకా రిజిస్టరు చేయలేదు కనుక, మిల్లరు గారి అబ్బాయిని అరెస్టు చేసే ప్రశ్న ఉత్పన్నం కాలేదు.

కారు క్రింద పడ్డ కుర్రాడికి మన నర్సింగ్ హోమ్ డాక్టరుగారు ఆపరేషను చేసి రక్షించారు. మన ప్లీడరుగారు చేసిన రాజీ ప్రకారం నర్సింగ్ హోమ్ ఖర్చంతా మిల్లరుగారే భరించారు. పిల్లవాని తల్లి తండ్రులకు నష్టపరిహారం క్రింద కొంత మొత్తం కూడా ముట్ట చెప్పారు. దెబ్బ తిన్న కారు మన గ్యారేజీ ఓనరుగారి దగ్గరికే వచ్చింది.

అయిన ఖర్చంతా ఇన్స్యూరెన్సు కంపెనీ దగ్గర రాబట్టారు మిల్లరుగారు.

**　　**　　**

ఐదేండ్ల తర్వాత: డాక్టరుగారు నర్సింగ్ హోమ్‌కి మరి రెండు అంతస్తులు కలిపారు. ప్లీడరుగారు ప్రాసిక్యూటరు అయినారు. గ్యారేజిలో జపాను సాయంతో చేసినకారులు అమ్మకం మొదలుపెట్టారు. సేఠ్‌జీ పెద్ద షోరూమ్ తెరిచారు. ఎస్.ఐ.గారు ఇన్‌స్పెక్టరుగా ప్రమోషన్ అయ్యి అదే ఊరులో వున్నారు. ఎం.ఎల్.ఏ.గారు మంత్రి అయినారు. స్టూవర్టుపురం దొంగకు తన స్నేహితులు (LION) సింహమనే బిరుదిచ్చారు. ●

వడ్డీ వ్యాపారులు, షావుకార్లు, గ్రామ పెద్దల కుటిల రాజకీయాలను ఎదుర్కొని
సంగ్రామ సింహమై
గ్రామ సింహాల ఆట కట్టించిన
వీర నారి
'ఆపదలో
అనూరాధ'
మీరు మెచ్చే మీకు నచ్చే
సౌజన్యగారి సీరియల్
త్వరలో...త్వరలో...త్వరలో...త్వరలో

**Next Best Next Best Next Best**